క్లుప్తంగా

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రాణిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 24 వేల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తామని, అనుమతి ఇవ్వాలని కోరారు. వారి వినతిని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు.కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు ఊటూరి శ్రీకాంత్ ఉన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలి



రైతులకు సూచనలిస్తున్న ప్రొఫెసర్లు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులు వేయాలని పొలాస వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ సాధ్వి, డాక్టర్ సౌజన్య కోరారు. జగిత్యాల రూరల్ మండలంలోని రఘురాముల కోటలో సోమవారం రైతు ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో సాగు ఖర్చులు తగ్గించుకుంటూ అధిక దిగుబడి సాధించాలని సూచించారు. వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో రమ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మేడిపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీని బిహార్ పర్యటనలో పోలీసులు అడ్డగించి అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేసినట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మార్గం నవీన్, ప్రేం సాగర్, మ్యాకల రాజు, శ్రీనాథ్, మధుకర్, వినోద్, రూపేశ్, అజయ్ శ్రీపతి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్ ప్రారంభం



భూదాత విజయ్‌రావుతో మహిళలు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో సోమవారం మార్కెట్ యార్డు ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కాగా అంతకుముందు మార్కెట్ యార్డుకు 10 గుంటలు దానమిచ్చిన బైర్నేని విజయ్‌రావుకు మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ విజయ్‌రావు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విలువగల 10 గుంటల స్థలాన్ని వితరణ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు, ఐక్యవేదిక సభ్యులు విజయ్‌రావును ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల పాత్ర కీలకం



విద్యార్థులు, హెచ్‌ఎంను సన్మానిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో ఎస్సెస్సీ ఫలితాల్లో మండల టాపర్, అత్యధిక మార్కులు సాధించిన స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను సోమవారం సన్మానించారు. విద్యార్థులకు మంచి మార్కులు రావాలని ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడంపై అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ ముస్కు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల్లో పశుగ్రాసం కొరత

- పొలాల్లోనే గడ్డి వదిలేస్తున్న రైతులు
- తగలబెడుతున్న మరికొందరు
- గడ్డిని చుట్టే యంత్రానికి గిరాకీ



గడ్డిని కట్టలు చుడుతున్న బేలర్

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు హార్వెస్టర్లతో పొలాలు కోయిస్తుండటంతో గడ్డి పొలమంతా పడుతుంది. చాలామంది రైతులు పొలాల్లోనే వరి గడ్డిని కాల్చేస్తున్నారు. దీంతో డెయిరీ ఫారం నిర్వాహకులకు ఒక్కటి రెండు గేదెలు, ఆవులు పెంచే వారికి పశుగ్రాసం కరువైంది. వేసవిలోనైతే పశువులకు బయట పచ్చిగడ్డి లేక ఇంట్లో ఎండు గడ్డి లేక పెంపకందారులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గోశాలల నిర్వాహకులు గడ్డి దొరకక, గడ్డిని దానం చేయాలని రైతులను ప్రాధేయపడుతున్నారు. ఈ యాసంగిలో జిల్లాలో వరి పంట ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పశు గ్రాసానికి మరింత డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో అక్కడక్కడ ఉన్న వరి గడ్డిని, గడ్డి కట్టే యంత్రాల ద్వారా కట్టలు కట్టించి నేరుగా రైతుల ఇళ్లకు చేర్చుతూ, పశుగ్రాసం కొరత తీర్చుతున్నారు.

వరి గడ్డి కట్టలు కట్టే యంత్రాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కటి, రెండు వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలు వచ్చాయి. ఇవి ట్రాక్టర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. ట్రాక్టర్ నడుస్తున్న కొద్ది పొలమంతా పడిన గడ్డిని కట్టలు కడుతూ, చివరకు ఊడి పోకుండా తాడు కూడా కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే 40–50 కట్టలు కడుతుంది. యంత్రం ద్వారా కట్టలు కట్టినందుకు ఒక్కో కట్టకు రూ 40–50 వరకు తీసుకుంటున్నారు. దీంతో, గ్రామీణ ప్రాంతాల్లో పాడి గేదెలు పెంచే వారు, ముందుగా రైతులతో పొలంలోని గడ్డి తీసుకెళ్లేందుకు ఎంతో కొంత డబ్బు చెల్లించి, యంత్రం చేత కట్టలు కట్టిస్తున్నారు. దీంతో గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో, చాలా మంది రైతులు గడ్డిని కాల్చడం లేదు. పొలాల్లోని గడ్డి కట్టలను పాడి పశువులు ఉండే చోట, వర్షం పడ్డ తడవని చోట గడ్డి కట్టలు పెడుతున్నారు. తర్వాత, అవసరాన్ని బట్టి పశువులకు పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు.

ప్రస్తుత సీజన్‌లో వరి గడ్డికి డిమాండ్

యాసంగి సీజన్‌లో వరి పంట స్థానంలో ఎక్కువగా మొక్కజొన్న వేయడంతో వరి గడ్డికి డిమాండ్ ఏర్పడింది. గతేడాది ఉచితంగా ఇచ్చిన రైతులు ఎకరంలోని గడ్డికి రూ 3–4 వేలు తీసుకుంటున్నారు. మరో ఆరు నెలల వరకు గడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో, పాడి రైతులు గడ్డిని కొనుగోలు చేసి కట్టలు కట్టించుకుని షెడ్లలో నిల్వ చేసుకుంటున్నారు. అలాగే, గోశాల నిర్వాహకుల బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా రాయికల్ మండలం బోర్నపల్లి, జగిత్యాల మండలం తాటిపల్లిలో గోశాలలు ఉండగా, ఒక్కో గోశాలలో 60–100 వరకు పశువులు ఉన్నాయి. వాటికి గడ్డిని దానం చేయాలని గోశాల నిర్వాహకులు కోరుతున్నారు. చివరకు గడ్డి ఇస్తే, కట్టలు కట్టించుకుని, మేము తీసుకెళ్లతామని రైతులకు విన్నవిస్తున్నారు.

పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోవాలి



యాసంగి సీజన్‌లో వరి కోతలు నడుస్తున్నందునా.. పశుగ్రాసాన్ని సేకరించుకోవాలి. యంత్రాలు రావడంతో గడ్డి కట్టలు కట్టి ఇంటి దగ్గర వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కనీసం 2–3 పశువులకు కనీసం 100 గడ్డి కట్టలు ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ బద్దం రాజేందర్ రెడ్డి, పశువైద్యాధికారి, మేడిపల్లి



ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం నుంచి అమ్మక్కపేట వెళ్లేదారిలో మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ పగిలి గత కొద్ది రోజుల నుంచి భగీరథ నీళ్లు రొడ్డు పక్క నుంచి వృథాగా పోతున్నాయి. అధికారులు మెయిన్ పైప్‌లైన్‌కు మరమతు చేసి స్వచ్ఛమైన తాగునీరు వృథా కాకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మల్లేశం, భగీరథ ఏఈ సెల్ నం: 7995660381

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏవో భాస్కర్

మల్యాల: భూసారం పెంపు కోసం రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని సొసైటీ సోమవారం పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని సహకార కార్యాలయంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వేంపేట సర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పలత రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు.ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవోలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు జీలుగ విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు బద్దం గోపి, అంకతి రాజన్న, ఏవో రాజ్‌కుమార్, ఏఈవోలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కోరుట్లరూరల్: సబ్సిడీపై రైతులకు అందించే జీలుగు విత్తనాలను డీసీఎంఎస్ గోదాంలో ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు నరే, ఫహీనా, శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలకేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో జీలుగ విత్తనాలను ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు శేఖర్, హరీశ్, సుష్మశ్రీ, మౌనిక, సంధ్య పాల్గొన్నారు.



శివపార్వతుల కళ్యాణంలో భక్తులు



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



మల్లాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి మహాదేవుడి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠాపించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు గంగప్రసాద్, మంత్రరాజం శ్రీనివాసచార్యులు, మంత్రరాజం జానకి రామకృష్ణచార్యులు, అరవింద్ కృష్ణచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవేంకశ్వరస్వామి కల్యాణం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణం జరిపించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణాన్ని తిలకించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలె అరుణ, రమేశ్ బాబు మనీషాతో పాటు సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, మాజీ సర్పంచులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీశంకర దాసమయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మల్లాపూర్: మండల కేంద్రంలో మేరు సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ శంకర దాసమయ్య సహిత శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం గత స్థాపిత దేవతార్చన, 9 గంటలకు యంత్ర మూర్తుల ప్రతిష్ఠ, హోమాలు శాంతి కల్యాణం, తీర్థప్రసాద వితరణ, మహాన్నదానంతో ప్రతిష్ఠాపన ఉత్సవాలు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు రామగిరి లింబాద్రి, సభ్యులు ప్రభాకర్, రవి, రాపర్తి వినోద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లిరూరల్:పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా నిలుస్తున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 126 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ, సహకార సంఘం చైర్మన్లు గోవర్దన్,తిరుపతిరెడ్డి, కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం చెర్లకొండాపూర్ శివారు ఒడ్డెర కాలనీ సమీపంలోని గుట్ట నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో నిత్యం మొరం తవ్వకాలు చేపడుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే మొరం తవ్వకాలు నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

▶ **వయోవృద్ధులకు డే కేర్ కేంద్రాలు మంజూరు**

జగిత్యాల: వయోవృద్ధులకు డేకేర్ కేంద్రం మంజూరైందని సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించగా, డే కేర్ మంజూరైందని, రాష్ట్ర వ్యాప్తంగా 37 డేకేర్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే జగిత్యాలలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథం, ప్రకాశ్‌రావు, హన్మంతరెడ్డి, యాకూబ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

▶ **కార్మికుల సంక్షేమానికి పాలకవర్గం కృషి**

మెట్‌పల్లి: వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేసే కార్మికుల సంక్షేమానికి మార్కెట్ పాలకవర్గం కృషి చేస్తుందని చైర్మన్ కూన గోవర్దన్ అన్నారు. మార్కెట్ కార్యాలయంలో సోమవారం కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కార్మికులకు దుస్తులుఅందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడి, డైరెక్టర్లు ఉన్నారు.

▶ **విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి**

కథలాపూర్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని భూషణరావుపేట, సిరికొండ గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ఉత్తీర్ణతను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నల్ల రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా కన్వీనర్‌గా స్వామి

జగిత్యాల: మాదిగ హక్కుల దండోరా జగిత్యాల జిల్లా కన్వీనర్‌గా మంతెన స్వామిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ ఉత్తర్వులు జారీ చేశారు. స్వామి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

▶ **ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గణేశ్**

రాయికల్: మండల తహసీల్దార్ ఖయ్యూం 45 రోజుల పాటు హజ్ యాత్రకు వెళ్లనున్న నేపథ్యంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డెప్యూటీ తహసీల్దార్ గణేశ్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

▶ **ఇండెన్ కార్యాలయం ఎదుట నిరసన**

ధర్మపురి: తమ వార్డులోకి సిలిండర్ సరఫరా చేసే బండి రావడం లేదని, మండలంలోని నక్కపేట గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఇండెన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని 10వ, వార్డుకు గ్యాస్ బండి రావడం లేదని, తమ వార్డులోకి బండిని పంపించాలని కోరుతూ వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో దుర్గం శేఖర్, శంకర్, సుజాత, గంగయ్య, లక్ష్మి, సంతు తదితరులు పాల్గొన్నారు.

▶ **మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే**

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనం నడిపితే జైలుకెళ్లడం తప్పదని గొల్లపల్లి ఎస్సై సతీశ్ అన్నారు. అతిగా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన వ్యక్తికి సోమవారం న్యాయమూర్తి నాలుగు రోజుల జైలుశిక్ష విధించారు. గొల్లపల్లి మండలం వెన్గుమట్ల గ్రామానికి చెందిన అల్ల రవీందర్ ఇటీవల మద్యం తాగి పట్టుబడగా, ఎస్సై సతీశ్ కేసు నమోదు చేశారు. నిందితున్ని సోమవారం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ ముందు హాజరు పర్చగా 4 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఘనంగా మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మడేలయ్య ఆలయంలో మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు హాజరై మడేలేశ్వర స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, దారిశెట్టి రాజేష్,కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు చికిత్స

జగిత్యాల: వందరోజుల్లో క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించి వెంటనే చికిత్స అందిస్తామని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో క్యాండిల్ లైట్ మెమొరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 397 గ్రామాల్లో క్షయ అనుమానితులను గుర్తించి అక్కడే చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మండలంలోని రత్నాపూర్ శివారులోని శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద నిర్మించిన బోర్‌వెల్‌ను సోమవారం మాజీ ఎంపీపీ నల్ల రాజన్నతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరిపెల్లి మల్లయ్య, కోటగిరి ఆనంద్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నారీశక్తి ప్రపంచానికి చాటాలి

జగిత్యాలటౌన్: మహిళలు స్వయం సమృద్ధిని సాధించి నారీశక్తిని ప్రపంచానికి చాటాలని బీజేపీ నాయకురాలు బండారు శైలజ అన్నారు. రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి సందర్భంగా సోమవారం బీజేపీ కార్యాలయంలో నివాళి అర్పించారు. దేశవ్యాప్తంగా అహల్యాభాయి జయంతి వేడుకలు నిర్వహించడం నారీలోకానికి దక్కిన గౌరవమన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, జిల్లా కన్వీనర్ మరిపెల్లి సత్యం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి నాయకులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి వివాహానికి సాయం

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన పేదింటి అమ్మాయి మౌనిక వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయం అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివాహానికి పుస్తె మెట్టెలు, స్టీల్ సామగ్రి, పెళ్లికి పట్టుచీర, 25కిలోల బియ్యం, వంటసరుకులు అందజేశారు. కార్యక్రమంలో రుద్ర రాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కావాలి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించే వృత్యాంతర శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంఈవో మధు అన్నారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా విషయాల వారిగా పాఠ్య పుస్తకాలు, పాఠ్యప్రణాళిక పుస్తకాలు వెంట తీసుకుని రావాలని కోరారు. శిక్షణకు హాజరు విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని తెలిపారు.కార్యక్రమంలో ఎంఐఎస్ కార్తీక్, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు నేటి నుంచి ఈ నెల 24 వరకు ఉపాధ్యాయుల సామర్థ్య నిర్మాణం (కెపాసిటీ బిల్డింగ్) శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నాగభూషణం తెలిపారు.హెచ్‌ఎంలు, ఎస్జీటీ ఉపాధ్యాయులకు బీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

వెల్గటూర్: ఎండపెల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ 96 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక, వైస్ చైర్మన్ గొల్ల తిరుపతి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందించారు. 102 మందికి రూ.31.58 లక్షల విలువైన చెక్కులు అందించారు.

సమాచారం

నేడు డయల్ యువర్ డీఎం

కోరుట్ల: నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. డిపో పరిధిలోని పరిసర గ్రామాల ప్రయాణికులు వారివారి సమస్యలు, సలహాలు, సూచనలను ఫోన్ ద్వారా తెలపాలని పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సెల్ నంబర్ 7382534960లో సంప్రదించాలని సూచించారు.

దారి మళ్లింపు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణ మంచినీళ్ల బావి సమీపంలోని గాంధీనగర్ ఏరియాలోని హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా ఈనెల 21 నుంచి జూలై 31వరకు ఈ రోడ్డు వెంట వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు నేషనల్ హైవే, రోడ్లు భవనాల శాఖ అధికారులు సోమవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. భారీ వాహనాలు నిజామాబాద్ జగిత్యాల బైపాస్ రోడ్డు నుంచి, ఫోర్ వీలర్స్, 2వీలర్ వాహనాలు బీట్ బజార్ మీదుగా గుట్ట రాజేశ్వర స్వామి దారి గుండా మళ్లిస్తామని, వాహనదారులు గమనించాలని కోరారు.

21న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 21న జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి సోమవారం తెలిపారు. అండర్–8,10,12 విభాగాల్లో పలు పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 6 గంటలకు నేరుగా స్టేడియంలో హాజరు కావాలని సూచించారు.